సాక్షి తిరుపతి
గురువారం । 31 । ఆగస్టు । 2023



వృత్తే దైవమని 'చాట'ండి

వెత్తలతడుకు ఆదిఆంధ్రవాడ వాసులు సుమారు 40 ఏళ్లుగా వెదురు చాటల తయారీతోనే జీవిస్తున్నారు. - 8లో



ఫ్లై ఓవర్ పనులు వేగవంతం

గూడూరులో అసంపూర్తిగా ఉన్న ఫ్లై ఓవర్ పనులను ప్రారంభించి వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. - 8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	34	25
చిత్తూరు	33	24
తిరుమల	39	21
గూడూరు	36	27
నగరి	35	25

న్యూస్‌రీల్

4న జాబ్ మేళా

తిరుపతి సిటీ : తిరుపతి ఎస్వీయూ ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో సెప్టెంబర్ 4వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఉపాధి కల్పనాధికారి టి.శ్రీనివాసులు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ నవభారత్ ఫర్టిలైజర్స్, కర్బాన్, సాయి సంగీత ఎలక్ట్రికల్స్ కంపెనీల ప్రతినిధులు మేళాకు హాజరై సుమారు 363 ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేసుకోనున్నట్లు వివరించారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, ఏదైనా డిగ్రీ విద్యార్హత కలిగిన అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరుకావచ్చని సూచించారు. ఎంపికైన వారు రేణిగుంట, తిరుపతి, చిత్తూరు, రాయచోటిలో విధులు నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు. ఇతర వివరాలకు ఎస్వీయూలోని ఎంప్లాయిమెంట్ ఆఫీసులో సంప్రదించాలని కోరారు.

మహిళా వర్సిటీలో పనులకు ఈ-టెండర్లు

తిరుపతి సిటీ : శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో గ్రీన్ హౌస్, ఓమిక్స్ ల్యాబ్ పునరుద్ధరణ, పునర్నిర్మాణానికి ఈ- ప్రొక్యూర్‌మెంట్ టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు రిజిస్ట్రార్ రజని తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ అర్హతలు, ప్రామాణిక వివరాల కోసం వర్సిటీ అఫీషియల్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. ఆసక్తిగల బిడ్డర్లు ఆంధ్రప్రదేశ్ ఈ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్‌లో తమ బిడ్‌లను అప్‌లోడ్ చేయాలని కోరారు.

కమనీయం.. కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు

సూళ్లూరుపేట : ధర్మ పరిషత్- ధర్మప్రచార మాసోత్సవాల్లో భాగంగా బుధవారం సూళ్లూరుపేట చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో శ్రీకాళహస్తీశ్వరస్వామి, జ్ఞానప్రసూనాంబ కల్యాణమహోత్సవం నిర్వహించారు. ముక్కంటి ఆలయ వేదపండితులు శాస్త్రోక్తంగా ఆది దంపతుల కల్యాణం జరిపించారు. కార్యక్రమంలో చెంగాళమ్మ ఆలయ కమిటీ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి , పాలకమండలి సభ్యులు ఎం.చంద్రశేఖర్‌రెడ్డి, ఎంఎం పద్మజ, బి.సునీత, కె.సురేష్, ఓ.బాలసత్యనారాయణ, పి.మారెమ్మ, మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కళత్తూరు శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో చండీయాగం



చండీయాగం నిర్వహిస్తున్న అర్చకులు

చిల్లకూరు : తూర్పుకనుపూరులోని ముత్యాలమ్మ ఆలయంలో బుధవారం పౌర్ణమిని పురస్కరించుకుని భక్తిశ్రద్ధలతో చండీయాగం నిర్వహించారు. ముందుగా అమ్మవారి మూల విరాట్‌కు అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. యాగంలో సుమారు 20 మంది దంపతులు పాల్గొన్నారు. పూర్ణాహుతి సమర్పణతో యాగం పరిపూర్ణమైంది. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ సిద్దారెడ్డి ఇంద్రసేనమ్మ, ఈఓ నవీన్‌కుమార్ పర్యవేక్షించారు. రాత్రి కనుల పండువగా అమ్మవారికి పల్లకీసేవ నిర్వహించారు.

అగ్రిసెట్-2023 రేపు

తిరుపతి సిటీ : వ్యవసాయ పాలిటెక్నిక్ పూర్తి చేసుకుని ఎంసెట్‌తో సంబంధం లేకుండా ఏజీ బీఎస్సీలో ప్రవేశం పొందేందుకు నిర్వహించే అగ్రిసెట్-2023 ఆన్‌లైన్ పరీక్షను శుక్రవారం నిర్వహించనున్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఏజీ బీఎస్సీలో 15శాతం సీట్లు కేటాయించనున్నారు. ఇందు కోసం రంగంపేట సమీపంలోని రామిరెడ్డిపల్లె వద్ద అయాన్ డిజిటల్ సెంటర్‌లో పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. పర్యవేక్షకుడిగా తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం అసోసియేట్ డైరెక్టర్ సి.రమణ వ్యవహరించనున్నారు.

అధ్యాపకుల వయోపరిమితి పెంపు



రిజిస్ట్రార్ మహ్మద్ హుస్సేన్

తిరుపతి సిటీ : ఎస్వీ యూనివర్సిటీలో అధ్యాపకుల వయోపరిమితిని 65 ఏళ్లకు పెంచుతున్నట్లు రిజిస్ట్రార్ మహ్మద్ హుస్సేన్ తెలిపారు. బుధవారం ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఎస్వీయూ పాలకమండలి సమావేశంలో రెండు అంశాలపై చర్చించినట్లు వెల్లడించారు. అందులో అకడమిక్ కన్సల్టెంట్ల వేతనాలు, వయోపరిమితిని 62 నుంచి 65 ఏళ్లకు పెంపుదల, 110 జీఓ అమలుకు పాలకమండలి ఆమోదం తెలిపిందన్నారు.

పచ్చ నేతల 'మేత'

గత టీడీపీ ప్రభుత్వంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని తమ్ముళ్లు చెలరేగిపోయారు. ఇప్పుడు కొందరు అవినీతి అధికారుల సహకారంతో ఆక్రమణల పర్వానికి తెరతీశారు. అలవాటుగా మారిన అక్రమాలకు తెగబడుతున్నారు. రూ.కోట్ల విలువైన మేత పోరంబోకు భూములను యథేచ్ఛగా మేసేశారు. రైతులకు సాగు నీరు అందించే చెరువును సైతం నిస్సంకోచంగా కబ్జా చేసేశారు. మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అండతోనే పచ్చ నేతలు రెచ్చిపోతున్నారని గ్రామస్తులు మండిపడుతున్నారు. బినామీ పట్టాలతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా రెవెన్యూ సిబ్బంది పట్టించుకోవడంలేదని ఆరోపిస్తున్నారు.

- టీడీపీ నేతల చెరలో మేత పోరంబోకు భూములు
- యథేచ్ఛగా 174 ఎకరాల ఆక్రమణ
- కబ్జాలకు సహకరిస్తున్న కొందరు అధికారులు
- పల్లిపాడు చెరువునూ కబళిస్తున్న తమ్ముళ్లు
- మాజీ ఎమ్మెల్యే అండతోనే అక్రమాలంటున్న గ్రామస్తులు



అలిమిలి పంచాయతీలో టీడీపీ నేతలు ఆక్రమించుకుని చదును చేసిన మేత పోరంబోకు భూమి

తిరుపతి సిటీ : వెంకటగిరి నియోజకవర్గం బాలాయపల్లె మండల పరిధిలోని మేతపోరంబోకు భూములు ఆక్రమణకు గురవుతున్నాయి. కోట్ల రూపాయలు విలువచేసే ఈ భూములను మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అనుచరులేనని కబ్జా చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనిపై ఎప్పటికప్పుడు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రూ.100కోట్ల పైనే..!

అలిమిలి పంచాయతీలోని సర్వే నంబర్ 4లో 174.20ఎకరాల భూములను ప్రభుత్వం పశువుల మేతకోసం కేటాయించింది. ప్రత్యక్ష మార్కెట్‌లో ఈ భూముల విలువ సుమారు రూ.100కోట్ల పైమాటే. రహదారికి అనుకుని ఉన్న ఈ భూములపై టీడీపీ నేతల కన్నుపడింది. రెవెన్యూ అధికారుల అండదండలతో వారు ఆక్రమణకు తెరలేపారు. జేసీబీ, ట్రాక్టర్లతో చదునుచేసి కబ్జా చేసేశారు. వెంటనే ఆయా భూముల్లో నిమ్మ చెట్లు నాటుకుంటున్నారు. ఇదిలా ఉంటే.. మరో వైపు పల్లిపాడు చెరువులో సైతం 29 ఎకరాలను చదునుచేసి ఆక్రమించుకుంటున్నారు. ఈ భూమి ఎకరం రూ.10 లక్షలు విలువ చేస్తుంది. అధికారులకు కాసులు ముట్టజెప్పి ఆయా భూములను ఆన్‌లైన్‌లో బినామీల పేరిట పట్టాలు సృష్టించుకుంటున్నారు. ఈ క్రమంలోనే సదరు భూమిని పేదలకు పంచుతామంటూ కొందరు టీడీపీ నేతలు ఎకరానికి రూ.50వేల చొప్పున వసూలు చేశారు. అయితే ఇప్పటి వరకు ఎవరికీ సెంటు భూమి కూడా అప్పగించలేదు. దీంతో పలువురు బాధితులు ప్రస్తుతం జరుగుతున్న భూబాగోతంపై బహిరంగంగానే వెల్లడిస్తున్నారు. వందల ఎకరాల ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు.



అసైన్డ్ భూములూ హాంఫట్!

టీడీపీ ముఖ్యనాయకుడి అండతోనే ఆ పార్టీ నేతలు యథేచ్ఛగా ఆక్రమణలు పాల్పడుతున్నట్లు గ్రామస్తులు స్పష్టం చేస్తున్నారు. కయ్యూరు గ్రామంలో పేదలకు చెందిన 12 ఎకరాల అసైన్‌మెంట్ పట్టా భూములను అగ్రిమెంట్ పేరుతో కాజేసింది కూడా వీరే అని వెల్లడిస్తున్నారు. ఈ విషయం బట్టబయలు కావడంతో ఆర్ఐ, వీఆర్ఓలు తనిఖీ పేరుతో సంబంధిత భూములను పరిశీలించారు. హడావిడిగా ముగ్గురు నిజమైన లబ్ధిదారులతోపాటు బోగస్ పట్టాదారులను పిలిపించి ఫొటోలు తీసుకుని విచారణ చూర్తిచేసినట్లు ఉన్నతాధికారులకు నివేదిక పంపించేశారు. తాము భూములను విక్రయించలేదని, సొంతంగానే సాగు చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు లబ్ధిదారులతో చెప్పించి సంతకాలు చేయించుకున్నట్లు గ్రామస్తులు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. ఈ విషయమై బాలయపల్లి తహసీల్దార్ శ్రీనివాసులును వివరణ కోరగా అలిమిలి, పల్లిపాడులో పర్యటించి మేత పోరంబోకు భూములు, చెరువులో ఆక్రమణలను పరిశీలించనున్నట్లు తెలిపారు. కబ్జా నిజమని తేలితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



లబ్ధిదారులు, బోగస్ పట్టాదారులతో రెవెన్యూ సిబ్బంది



పల్లిపాడు చెరువులో కబ్జా చేసిన భూమిని చదును చేస్తున్న దృశ్యం

పారదర్శకంగా ఓటరు జాబితా



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్ : ఓటరు జాబితాను పారదర్శకంగా తయారు చేస్తున్నట్లు కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో వివిధ పార్టీల నేతలు, అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ-2024కు సంబంధించి సర్వే పూర్తి చేశామని, పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్‌ను సెప్టెంబర్ 29వ తేదీ నాటికి పూర్తి చేయనున్నట్లు స్పష్టం చేశారు. సర్వేలో మొత్తం 1,78,988 క్లయిమ్స్ అందాయని, నోటీసులు ఇచ్చి నిర్ధారణ చేసిన తర్వాత అనంతరం రికార్డు ఫైల్ చేసిన తర్వాతే తొలగింపులు చేపట్టనున్నట్లు వివరించారు. భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు తొలగించిన ఓటర్ల జాబితా మేరకు వెరిఫికేషన్ దిశగా బీఎల్ఓలు సర్వే చేపట్టాలని ఆదేశించారు. ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు ,స్పెషల్ ఆఫీసర్లు , జిల్లా ఎన్నికల అధికారిగా తాను ఓటర్ల జాబితాపై పరిశీలన చేపట్టినట్లు వెల్లడించారు. తమకు అందిన ప్రతి ఫిర్యాదును నిశితంగా పరిశీలిస్తున్నట్లు వివరించారు. ఎన్నికల కమిషన్ ప్రతివారం రాజకీయ పార్టీలతో సమావేశం ఏర్పాటు చేయాలని ఆదేశించిందని, ఆమేరకు ఎస్ఎస్ఆర్ -2024 షెడ్యూల్ పూర్తయ్యే వరకు సమావేశాల నిర్వహణ కొనసాగుతుందని వెల్లడించారు. చిన్నపాటి తప్పిదాలకు సైతం తావులేకుండా ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో చంద్రమౌళిరెడ్డి (వైఎస్సార్‌సీపీ), రవి (కాంగ్రెస్), సుధారెడ్డి, మనోహరాచారి (టీడీపీ) ఈఆర్ఓలు కిరణ్ కుమార్, కనక నరసారెడ్డి, శ్రీనివాసులు, ఏఈఆర్ఓలు శిరీష, వెంకటరమణ, ఎన్నికల తహసీల్దార్ సురేష్ , డీటీలు కిరణ్మయి, జీవన్ పాల్గొన్నారు.



సంతృప్తికంగా సుపరిపాలన

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని వెంకటగిరి వాసులు సంతృప్తి వ్యక్తంచేశారు. బుధవారం గడపగడపకు మన ప్రభుత్వంలో భాగంగా నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి 22వ వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయనకు అద్భుతమైన అనుభవం ఎదురైంది. ప్రజలే స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ప్రభుత్వ పథకాలపై ప్రశంసల జల్లు కురిపించారు. మక్బూల్ అనే వ్యక్తి మాట్లాడుతూ చిన్నాచితకా పనులు చేసుకుని పొట్టపోసుకునే వారమేని, జగనన్న సాయంతో తమ పిల్లలు వ్యాపారం చేసుకునే స్థాయికి ఎదిగారని తెలిపారు. సయ్యద్ సాహెబ్ మాట్లాడుతూ ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలన్నీ అందుతున్నాయని కొనియాడారు. దీనిపై నేదురుమల్లి స్పందిస్తూ ప్రజాసేవే పరమావధిగా ముఖ్యమంత్రి అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. – వెంకటగిరి రూరల్

ఆలయ పునర్నిర్మాణానికి భూమిపూజ



భూమి పూజ చేస్తున్న మంత్రి రోజా, సెల్వమణి దంపతులు

నింద్ర: మండలకేంద్రంలోని శ్రీపసన్నవేంకటేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి మంత్రి ఆర్‌కే రోజా, సెల్వమణి దంపతులు బుధవారం భూమి పూజ చేశారు. శిథిలావస్థకు చేరిన ఆలయ జీర్ణోద్ధరణపై గత ఏడాది స్థల దాత రమేష్‌నాయుడు, గ్రామస్తులతో కలిసి మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆమె వెంటనే స్పందించి అప్పటి టీటీడీ బోర్డు చైర్మన్ వైవీ సుబ్బారెడ్డితో మాట్లాడారు. టీటీడీ నుంచి ఆలయ నిర్మాణానికి రూ.1.70కోట్లు మంజూరు చేయించారు. ఈ సందర్భంగా మంత్రి రోజా మాట్లాడుతూ సుమారు 200 ఏళ్ల నాటి పురాతన ఆలయాన్ని పునర్మించే అవకాశం దక్కడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం వినాయకస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ వసంతమ్మ, ఎంపీపీ దీప, వైస్ ఎంపీపీ శుభ, సచివాలయ మండల కన్వీనర్ బాబురెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన కార్యదర్శి శ్యామ్‌లాల్, పార్టీ జిల్లా కార్యదర్శి మేరీ, సాహిత్య అకాడమీ డైరక్టర్ జయశ్రీ, పార్టీ మండల కన్వీనర్ వేణురాజు, సోషల్ మీడియా కన్వీనర్ వెంకటేష్ పాల్గొన్నారు.

స్మార్ట్ బోధనపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న డీఈఓ శేఖర్

సత్యవేడు: ఉపాధ్యాయులకు స్మార్ట్ బోధనపై అవగాహన అవసరమని డీఈఓ వి.శేఖర్ తెలిపారు. బుధవారం సత్యవేడు బాలుర ఉన్నత పాఠశాలలో సైన్స్ టీచర్లు, పీఈటీలకు నిర్వహిస్తున్న పునశ్చరణ తరగతులను పరిశీలించారు. డీఈఓ మాట్లాడుతూ ఐఎఫ్‌పీ (ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్) డిజిటల్ బోర్డులను విద్యార్థులు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయులు మెలకువలను పాటిస్తూ పిల్లలకు అర్థమయ్యేలా పాఠ్యాంశాలను బోధించాలని స్పష్టం చేశారు. అనంతరం డిజిటల్‌బోర్డులో ఇంగ్లిషు- తెలుగు, నిఘంటువును ఓపెన్ చేసుకొనే విధానంపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు యోగాపై ఆసక్తిని పెంపొందించి ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు పీఈటీలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓలు రవి, ఉషా, ప్రధానోపాధ్యాయిని భారతి, ఉపాధ్యాయులు, రిసోర్సుపర్సన్లు భాస్కర్, ఆనంద్, శ్రీదేవి, మురళి, బాబు, కుమార్ పాల్గొన్నారు.

పాఠశాల ఆవరణలో ఫిర్యాదుల పెట్టె

వరదయ్యపాళెం: విద్యార్థుల సమస్యలపై ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులు దృష్టి సారించాలని డీఈఓ శేఖర్ సూచించారు. బాలికలు బయటకు చెప్పుకోలేని సమస్యలను తెలిపేందుకు పాఠశాల ఆవరణలో ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేస్తామని తెలిపారు. బుధవారం వరదయ్యపాళెం హైస్కూల్‌ను ఆయన సందర్శించారు. ఇటీవల 8వ తరగతి విద్యార్థినితో అనుచితంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడి తీరుపై ఆరా తీశారు. అనంతరం టీచర్లతో సమావేశం నిర్వహించారు. మహిళా ఉపాధ్యాయులు బాలికలతో స్నేహపూర్వకంగా మెలుగుతూ వారి సమస్యలను తెలుసుకోవాలని కోరారు. విద్యార్థినులతో తప్పుగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మళ్లీ ఇలాంటి ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటామని బాధిత బాలిక తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు. అనంతరం డిజిటల్ బోర్డు ద్వారా బోధనను పరిశీలించారు.

పోలీసు కుటుంబాలకు అండ



మాట్లాడుతున్న ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి

తిరుపతి క్రైం : పోలీసు శాఖలో పనిచేస్తూ వివిధ కారణాలతో మృతి చెందిన వారి కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన పలువురు పోలీసు కుటుంబీకులతో సమావేశమయ్యారు. ఎస్పీ మాట్లాడుతూ అంకితభావంతో విధులు నిర్వర్తిస్తూ కొందరు పోలీసులు, హోంగార్డులు ఇటీవల అకాల మరణం చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా కుటుంబాల వారు ఎలాంటి సమస్య వచ్చినా నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. వారి కోసమే ప్రత్యేకంగా వారధి పోలీస్ టెలిగ్రామ్ గ్రూపును అదనపు ఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో ఏఎస్పీ వెంకట్రావు పాల్గొన్నారు.

ఆరోపణలపై ప్రమాణానికి సిద్ధం



ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

గూడూరురూరల్ : మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ చేసిన ఆరోపణలపై ఎక్కడైనా ప్రమాణం చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ స్పష్టం చేశారు. బుధవారం పట్టణంలోని సనత్‌నగర్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాజకీయ విమర్శలను హుందాగా తీసుకోవాలని, తనపై అవినీతి ఆరోపణలను రుజువు చేస్తే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానన్నారు. ఆదరించిన పార్టీకి అన్యాయం చేసి సునీల్ కుమార్ టీడీపీలోకి వెళ్లారని విమర్శించారు. పార్టీలు మారే వ్యక్తులను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని తెలిపారు. అందుకే 45 వేల ఓట్ల తేడాతో ఓడించి గుణపాఠం చెప్పినా మాజీ ఎమ్మెల్యేకు అహంకారం తగ్గలేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తనపై నమ్మకంతో ఎమ్మెల్సీ పదవి ఇచ్చారని, అప్పుడు గూడూరుకు వస్తే వేలాదిమంది స్వచ్ఛందంగా తరలివచ్చి స్వాగతం పలికారని గుర్తుచేశారు. ఇప్పుడు తానెవరో తెలియదని సునీల్‌కుమార్ చెప్పడం హాస్యాస్పదమన్నారు. 2014లో తన చేతులమీదుగానే సునీల్‌కుమార్‌కు బీఫామ్ అందజేశానని తెలిపారు. ఎవరైనా తప్పుచేస్తే కచ్చితంగా నిలదీస్తామని స్పష్టం చేశారు.

ముఖ్యమంత్రి చిత్రపటానికి రాఖీలు



సీఎం కటౌట్‌కు రాఖీలు కడుతున్న మహిళలు

శ్రీకాళహస్తి: పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి మహిళలు రాఖీ కట్టి తమ అభిమానం చాటుకున్నారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ మహిళల సంక్షేమానికి ముఖ్యమంత్రి అనేక పథకాలు ప్రవేశపెట్టారన్నారు. ఆయనకు మహిళల ఆశీర్వాదం ఉండాలని కోరారు. బియ్యపు పవిత్రారెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు అగ్రపీఠం వేస్తున్నారన్నారు. హోంమంత్రి పదవిని మహిళకు ఇచ్చి సముచితస్థానం కల్పించారని కొనియాడారు. అనంతరం మహిళలకు చీరలు, స్వీట్లు పంపిణీ చేశారు.

శ్రీవారి సేవలో బ్రహ్మానందం



తిరుమల : తిరుమల శ్రీవారిని సినీ నటుడు బ్రహ్మానందం సేవించుకున్నారు. బుధవారం ఆలయ వద్ద ఆయనకు అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు. లడ్డూ ప్రసాదాలను అందించి ఘనంగా సత్కరించారు.

క్లుప్తంగా

మలేషియా వర్సిటీతో మహిళా వర్సిటీ ఒప్పందం



వీసీ భారతికి ఒప్పంద పత్రాలు అందజేస్తున్న యూఎంకే వీసీ రజ్లీబిన్ చే రజాక్

తిరుపతి సిటీ : యూనివర్సిటీ ఆఫ్ మలేషియా కెలాంతస్ (యూఎంకే)తో శ్రీపద్మావతి మహిళా వర్సిటీ పలు అంశాలపై ఒప్పందం కుదుర్చుకుంది. మంగళవారం మలేషియాలో బయో ఇంజినీరింగ్‌పై నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో వీసీ డి.భారతి పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ మహిళా వర్సిటీ విద్యార్థులు పోటీ ప్రపంచంలో దీటుగా రాణించేలా సామర్థ్యాలను పెంపొందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. అందులో భాగంగా ఇండస్ట్రియల్ విజిట్, ఇంటర్న్‌షిప్, స్టాఫ్ మొబిలిటీ, టీచింగ్, పరిశోధనలో పరస్పరం సహాయ సహకారాలు అందించుకునేందుకు మలేషియా వర్సిటీతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు వివరించారు. అలాగే స్కిల్ డెవలప్‌మెంట్, డ్యూయల్ డిగ్రీ కోర్సులను ప్రోత్సహించడంలో రెండు వర్సిటీలు సమన్వయంతో పనిచేయనున్నట్లు వెల్లడించారు. అనంతరం వీసీ భారతికి యూఎంకే వీసీ డాక్టర్ రజ్లీబిన్ చే రజాక్ ఒప్పంద పత్రాలను అందజేశారు. సదస్సులో ప్రొఫెసర్లు సువర్ణలతాదేవి, జయమాధురి, విజయకుమారి పాల్గొన్నారు

అడవికొడియంబేడులో చోరీ

పిచ్చాటూరు : మండలంలోని అడవికొడియంబేడులో మంగళవారం రాత్రి ఓ ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. వివరాలు.. గ్రామానికి చెందిన సురేష్, రేఖ దంపతుల కుమార్తె వివాహం నాగలాపురంలో జరిగింది. అందరూ పెళ్లికి వెళ్లడంతో ఇంటి తాళాలు పగులగొట్టి దొంగలు లోపలికి చొరబడ్డారు. బీరువాలోని 5 సవర్ల బంగారు నగలు, రూ.10వేల నగదు అపహరించారు. అలాగే గోవర్ధనగిరిలో బాలయ్య అనే వ్యక్తి ఇంట్లో చోరీకి యత్నించారు. బాలయ్య కేకలు వేయడంతో పరారయ్యారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ వెంకటేశ్వర్లు కేసు నమోదు చేశారు. ఘటనాస్థలాలను పరిశీలించారు. దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వృత్తే దైవమని చాటండి!



■ నాపేరు వీ.రామమూర్తి. వెత్తలతుడుకు ఏపడబ్ల్యూ సర్పంచ్‌ని. మా పెద్దలు చూపిన చాటల తయారీ వృత్తినే దైవంగా భావించి జీవిస్తున్నాం. ఈ వృత్తిద్వారా సంఘంలో గౌరవంగా బతుకుతున్నాం. గత సర్పంచ్ ఎన్నికల్లో నిలిచి సర్పంచ్‌గా గెలుపొందాను. నేను సర్పంచ్ అయినా.. మా కుటుంబం అంతా ఇప్పటికీ చాటల తయారీతోనే జీవనం సాగిస్తోంది.



■ మా ఊరు నారాయణవనం మండలం, వెత్తలతడుకు ఆదిఆంధ్రవాడ. నా పేరు వీ.దేవి. గత 40 ఏళ్లుగా మా గ్రామంలో చాటల తయారీనే వృత్తిగా జీవిస్తున్నాం. గతంలో మా పెద్ద వాళ్లు అడవులకెళ్లి వెదురును తెచ్చి చాటలు తయరు చేసేవాళ్లు. ఫారెస్టు వాళ్లు అడ్డుకోవడం వల్ల ఇప్పుడు పుత్తూరులో వెదురు కొని చాటలు తయారు చేసి అమ్ముతున్నా.

కొందరు కుల వృత్తిని చెప్పడానికి నమోషీగా ఫీలవుతుంటారు. మరికొందరు తమ వృత్తి ఏంటని అడగగానే మాట దాటేస్తుంటారు. కానీ నారాయణవనం మండలం, వెత్తలతడుకు ఆదిఆంధ్రవాడ వాసులు మాత్రం కుల వృత్తినే దైవంగా భావిస్తున్నారు. తరతరాలుగా నమ్ముకున్న వృత్తినే నేటికీ కొనసాగిస్తున్నారు. ఆధునిక ప్రపంచంతో పోటీ పడుతూ ప్రాచీన వృత్తికి జీవం పోస్తున్నారు. మానవ జీవితంలో నిత్యావసర వస్తువైన వెదురు చాటలు అల్లుతూ తమ బతుకులకు ఎదురు లేదని చాటిచెబుతున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో మరింత ముందుకు దూసుకుపోతున్నారు.

- వెదురు చాటల తయారీతోనే జీవనం
- గ్రామంలో 90 శాతం మందికి ఇదే వృత్తి
- సర్పంచ్ కుటుంబానికీ ఇదే జీవనాధారం
- తమిళనాడు, పాండిచ్చేరికి ఎక్కువగా ఎగుమతి

నారాయణవనం: నారాయణవనం మండలం, వెత్తలతడుకు ఆదిఆంధ్రవాడ వాసులకు వెదురు చాటల తయారీనే జీవనాధారం. 40 ఏళ్లుగా ఇదే వృత్తిని కొనసాగిస్తున్నారు. గ్రామంలో 90 శాతం కుటుంబాలు చాటల తయారే బతుకుదెరువు. తమిళనాడు, పాండిచ్చేరి రాష్ట్రాలకు ఎగుమతి చేసి లాభాలు గడిస్తున్నారు.

సర్పంచ్ కుటుంబానిదీ ఇదే వృత్తి

వెత్తలతడుకు ఆదిఆంధ్రవాడ గ్రామంలో మొత్తం 124 కుటుంబాలున్నాయి. ఇందులో 103 కుటుంబాలు చాటల తయారీపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. గ్రామ సర్పంచ్ కుటుంబం సహా ఇదే వృత్తినే నమ్ముకుని జీవిస్తోంది. 20 ఏళ్ల క్రితం వరకు ఈ గ్రామ ప్రజలు తమ గ్రామాన్ని ఆనుకొని ఉన్న అడవుల్లోకి వెళ్లి వెదురు కర్రలు తెచ్చి వాటి ద్వారా చాటల తయారీ చేసి జీవించేవారు. తరువాత ఫారెస్టు అధికారులు అనుమతి నిరాకరించారు. ఆ సమయంలో పక్కనే ఉన్న పుత్తూరు పట్టణంలో కొంతమంది చాటల తయారీకి అవసరమైన వెదురు ముడిసరుకును కొనుగోలుచేసి చాటలు తయారు చేస్తున్నారు. ఇలా చేసిన చాటలను చుట్టుప్రక్కల గ్రామాలతో పాటు తమిళనాడు, పాండిచ్చేరి రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు.



వెత్తలతడుకులో కుటుంబ సభ్యులతో కలిసి చాటలు తయారు చేస్తున్న దృశ్యం

చాటలలో రెండు రకాలు

చాటలలో రెండు రకాలు ఉంటాయి. పుత్తూరులో జత చాటలకు అవసరమయ్యే ముడిసరకు ధర రూ.80(చిన్నది), రూ.85(పెద్దది) చెల్లించి కొనుగోలు చేస్తారు. వాటిని చాటగా తయారు చేసి హోల్‌సేల్ వ్యాపారులకు జత రూ.130(పెద్దది), రూ.120(చిన్నది)కు విక్రయిస్తుంటారు. గ్రామాలకు తీసుకెళ్లితే రిటైల్ ధర రూ.170(పెద్దది), రూ.150(చిన్నది)కు అమ్ముతుంటారు.

తమిళుల సంప్రదాయ వస్తువు వెదురు

ప్రాచీన కాలం నుంచి తమిళులకు వెదురు చాట సంప్రదాయ వస్తువు. ఇంటి అవసరాలు, వ్యవసాయ అవసరాలు, అన్ని రకాల కార్యాలయాల్లో వెదురుచాటను వినియోగిస్తుంటారు. వ్యవసాయ ఒబ్బిళ్లకు, బియ్యం, చిరుధాన్యాలు శుభ్రం చేయడానికి చాటలు వాడుతుంటారు. ఇంటిని, పరిసరాలను శుభ్రం చేయడానికి కూడా వీటిని వినియోగిస్తారు. మానవ జీవితంలో చాట నిత్యావసర వస్తువే.



నారాయణవనం మండలం వెత్తలతడుకు లో తయారు చేసిన చాటలను ఎండలో ఆరబెట్టుతున్న దృశ్యం

రోజుకు రూ.500 పైనే

వెదురు చాటలు తయారీ ద్వారా రోజుకు రూ.500 వరకు సంపాదిస్తామని గ్రామ మహిళలు అంటున్నారు. ఇంట్లోనే ఇంటి పనులు చేసుకుంటూ చాటలు తయారు చేస్తామని చెబుతున్నారు. 12 ఏళ్ల పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ చాటల తయారీలో అరితేరి ఉంటారు. పాఠశాలకు సెలవు సమయాల్లో పిల్లలు సైతం తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా సహాయ పడుతుంటారు. మగవాళ్లు పెయింటింగ్ వంటి పనులకు వెళ్లగా.. ఆడవాళ్లు చాటల తయారీలో నిమగ్నమవుతుంటారు.

తమిళనాడు, పాండిచ్చేరికి ఎగుమతి

వెత్తలతడుకులో తయారయ్యే చాటలు తమిళనాడు, పాండిచ్చేరి రాష్ట్రాలకు ఎగుమతి చేస్తుంటారు. ఆ రెండు రాష్ట్రాల్లోని హోల్‌సేల్ వ్యాపారులు గ్రామానికి వచ్చి మొత్తంగా చాటలు కొనుగోలు చేసి తీసుకెళ్తుంటారు. కొంతమంది చుట్టుపక్కల గ్రామాలకు తీసుకెళ్లి విక్రయిస్తుంటారు.

ప్రభుత్వం చేయూత

చాటల తయారుచేసే వెత్తలతడుకు వాసులకు వైఎస్ఆర్ ఆసరా, జగనన్న చేయూత, జగనన్న తోడు ద్వారా ప్రభుత్వ ఆర్థిక సాయం అందుతోంది. అలాగే సున్నా వడ్డీ, పీఎంఈజీపీ, శ్రీనిధి, బ్యాంకు లింకేజీ, సీఐఎఫ్‌ల ద్వారా రుణాలు అందుతున్నాయి.



వెత్తలతడుకులో చాటలు తయారు చేస్తున్న మహిళలు

వృత్తిని వదల్లేం



మా ఇంట్లో అందరూ కలిసి చాటలు తయారు చేస్తుంటారు. వాటిని అమ్మగా వచ్చిన డబ్బులను కుటుంబ అవసరాలకు, పిల్లల చదువుకు, ఇతర ఖర్చులకు వాడుకుంటుంటాం. ఈ వృత్తిని వదులుకోవాలన్న ఆలోచన మాకు లేదు.

-అనిత

సెలవు రోజుల్లో సాయపడతారు



సెలవు రోజుల్లో పిల్లలు కూడా మాతో కలిసి చాటలు తయారీ చేస్తుంటారు. మేము ఎలాగో ఈ వృత్తిని వదులుకోలేం. మా పిల్లలైన పెద్ద చదువులు చదివి ఉద్యోగాల్లో స్థిరపడితే అదే చాలు.

-అరుణ

పథకాలు చేయూతనిస్తున్నాయి



ప్రభుత్వం అందించే రకరకాల పథకాలు చేయూతనిస్తునాయి. వాటి ద్వారా వచ్చే డబ్బును ఉపయోగించుకొని వృత్తిని మెరుగుపరుచుకుంటున్నాం. వాటివల్లే మేము ఆర్థికంగా నిలదొక్కుకోగలుగుతున్నాం.

-వెల్లెమ్మ

జనాలపైకి దూసుకెళ్లిన కారు

గూడూరురూరల్ : పట్టణంలోని నారాయణమ్మవీధిలో బుధవారం మధ్యాహ్నం ఓ కారు జనాలపైకి దూసుకెళ్లింది. డ్రైవర్ మద్యం మత్తులో వేగంగా నడుపుతూ ఆ మార్గంలో వెళ్లే పాదచారులను ఢీకొట్టాడు. దీంతో పలువురు గాయపడ్డారు. స్థానికులు కారు డ్రైవర్‌కు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం గూడూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

తాపీ మేస్త్రీలకు బహుమతులు



మేస్త్రీలకు బహుమతులు అందిస్తున్న ఛాయాపతి

ఏర్పేడు : మండలకేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్ వద్ద బుధవారం తాపీ మేస్త్రీలకు భారతి సిమెంట్ టెక్నికల్ ఇంజినీర్ ఛాయాపతి బహుమతులు అందజేశారు. సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు నల్లపాలెం శివయ్య ఆధ్వర్యంలో నిర్మిస్తున్న 11 పంచాయతీ కాంప్లెక్స్ గదుల నిర్మాణానికి వాడుతున్న భారతి సిమెంట్ నాణ్యతను పరిశీలించారు. సిమెంట్, ఇసుక, నీరు మిశ్రమాలను ఉపయోగించి క్యూరింగ్ పద్ధతిని తాపీ మేస్త్రీలకు వివరించారు. భవన నిర్మాణ కార్మికులకు భారతి సిమెంట్ వారి టీషర్ట్‌లు అందజేశారు. భారతి సిమెంట్ సుమతి ట్రేడర్స్ అధినేత మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

పీజీ పరీక్షల వాయిదాకు వినతి



వినతి పత్రం అందిస్తున్న నేతలు

తిరుపతి సిటీ : ఎస్ఐ ఉద్యోగాల కోసం ప్రిలిమ్స్‌లో ఉత్తీర్ణులైన పీజీ విద్యార్థులకోసం వచ్చేనెల మొదటి వారంలో నిర్వహించనున్న పరీక్షలను వాయిదా వేయాలని వైఎస్సార్‌సీపీ విద్యార్థి సంఘం నేత ప్రేమ్‌కుమార్ కోరారు. బుధవారం ఈ మేరకు వీసీ రాజారెడ్డికి వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ ప్రిలిమ్స్ నెగ్గిన విద్యార్థులు ఈ నెల 15వరకు పోలీస్ ఈవెంట్స్‌లో పాల్గొనవలసిఉందన్నారు. అదే తేదీల్లో పీజీ పరీక్షలు ఉన్నందున వాయిదా వేయాలని కోరామని తెలిపారు. వీసీ సానుకూలంగా స్పందించారని ఈవెంట్స్‌కు హాజరయ్యే విద్యార్థులకు 20వ తేదీ నుంచి పరీక్షలు నిర్వహించనున్నట్లు హామీ ఇచ్చారని వెల్లడించారు.

హత్యకేసులో ఒకరికి జీవితఖైదు

- ఇద్దరికి ఐదేళ్లు.. మరొకరికి ఏడాది జైలు

కేవీబీపురం : పదేళ్ల కిందట జరిగిన ఓ మహిళ హత్య కేసులో నిందితులకు జైలు శిక్ష విధిస్తూ బుధవారం శ్రీకాళహస్తి న్యాయస్థానం తీర్పు వెలువరించింది. ఈ మేరకు పుత్తూరు రూరల్ సీఐ సురేష్ కుమార్ వివరాలు వెల్లడించారు. మండలంలోని పెరిందేశంలో 2013 సంవత్సరం టి.చిరంజీవి దంపతుల ఘర్షణకు సంబంధించి ఇరువర్గాలు పరస్పరం దాడులకు దిగాయి. ఈ దాడుల్లో వెట్టి మురగమ్మ అనే మహిళ కత్తిపోటుకు గురై మృతి చెందింది. దీనిపై ఏడు సెక్షన్ల కింద అప్పటి సీఐ సునీల్‌కుమార్ కేసు నమోదు చేశారు. పదేళ్లుగా సాగిన విచారణలో కేసులోని మొదటి ముద్దాయి చిరంజీవికి జీవిత ఖైదు, మూడో ముద్దాయి బి.గోపి, నాలుగో ముద్దాయి టి.ఎంజీకి ఐదేళ్లు, రెండో ముద్దాయి టి.చెల్లయ్య అనే వ్యక్తికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ శ్రీకాళహస్తి జిల్లా జడ్జి అన్వర్‌బాషా తీర్పు ఇచ్చారు. ఈ నలుగురిపై రౌడీషీట్ ఓపెన్ చేసినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్ఐ సునీల్, కోర్టు కానిస్టేబుల్ దామోదర, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్యనిర్వాహక ఇంజనీరు (వ్యవసాయ మార్కెటింగ్) వారి కార్యాలయము, కడప.
ఇ. ప్రొక్యూర్‌మెంటు టెండరు నోటీసు

టి.నో.నం.07/ఇఇ(ఎం)/కెడిపి/2024-24 తేది: 30.08.2023

కార్యనిర్వాహక ఇంజనీరు (వ్యవసాయ మార్కెటింగ్) కడప వారు చిత్తూరు జిల్లాలోని బి.యన్ కండ్రిగ మరియు ఐరాల వ్యవసాయ మార్కెట్ యార్డులోని పనులకు అర్హులైన కాంట్రాక్టర్ల నుండి ఆన్‌లైను ద్వారా టెండర్లు కోరుచున్నారు. మిగతా వివరములకు https://tender.apeprocurement.gov.in/ మీద సంప్రదించగలరు.

(కె. వెంకటేశ్వర రావు) కార్యనిర్వాహక ఇంజనీరు,(వ్యవసాయ మార్కెటింగ్), కడప.

విద్యుత్ స్తంభాలను ఢీకొన్న లారీ

- నేలకొరిగిన 10 స్తంభాలు
- తప్పిన పెను ప్రమాదం



బత్తలవల్లంలో నేలకొరిగిన స్తంభం



చిందరవందరగా తెగిపడిన విద్యుత్ వైర్లు

వరదయ్యపాళెం: మండలంలోని బత్తలవల్లంలో బుధవారం టిప్పర్ లారీ డ్రైవర్ వాహనాన్ని నిర్లక్ష్యంగా నడిపి విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో 10 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఆ సమయంలో వెంటనే విద్యుత్ సరఫరా ఆగిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. గ్రామస్తుల కథనం మేరకు.. బత్తలవల్లం ప్రధాన రోడ్డు నుంచి లోనికి వెళ్లే మార్గంలో అదే గ్రామానికి చెందిన టిప్పర్ లారీ యజమాని లారీని మంగళవారం రాత్రి తన ఇంటి వద్ద నిలిపి ఉంచాడు. అప్పుడు ట్రక్కును పైకి లేపి ఉంచాడు. బుధవారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో లోడింగ్ కోసం టిప్పర్ తీసుకెళుతుండగా వెనుకవైపు పైకి ఉంచిన ట్రక్కు విద్యుత్ స్తంభానికి తగిలింది. దీంతో వరుసగా 10 స్తంభాలు నేలకొరిగి విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. అంతేకాక ట్రాన్స్‌ఫార్మర్ సైతం దిమ్మె నుంచి కింద పడింది. ఆ సమయంలో ఫీజు ట్రిప్ కావడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. మండల విద్యుత్‌శాఖ ఏఈ శివప్రసాద్ లారీ యజమానిపై వరదయ్యపాళెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

అనాథల పిల్లలకు ఆశీర్వాదం

తిరుపతి అర్బన్ : ఏర్పేడు ఎస్‌టీఎస్ స్వచ్ఛంద సంస్థలోని పలువురు అనాథ పిల్లలు బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటరమణారెడ్డికి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన పిల్లలకు మిఠాయిలు తినిపించారు. బాగా చదువుకుని ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆశీర్వదించారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకుడు పరేష్ ఉన్నారు.



కలెక్టర్‌కు రాఖీ కడుతున్న పిల్లలు

గూడూరు ఫ్లైఓవర్ పనులు వేగవంతం

తిరుపతి అర్బన్ : గూడూరులో నిర్మిస్తున్న ఫ్లైఓవర్ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి వర్చువల్ విధానంలో ఎమ్మెల్యే వరప్రసాద్‌రావుతో కలిసి సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ పట్టణంలో అసంపూర్తిగా ఉన్న ఆర్‌ఓబీ ఫ్లైఓవర్‌ను ప్రణాళికాబద్దంగా నిర్మించాలని స్పష్టం చేశారు. 14 ఏళ్లుగా ఆగిన వంతెన పనులను నాణ్యతాప్రమాణాల మేరకు వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ఇందుకోసం ఆర్అండ్‌బీ, రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్‌శాఖ అధికారులు సమష్టిగా పనిచేయాలని కోరారు. సేకరించిన భూమిలో ఆక్రమణలకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌డీఓ కిరణ్‌కుమార్‌ను ఆదేశించారు. సంబంధిత అంశాలపై కోర్టు సమస్యలుంటే వాటిని వెంటనే పరిష్కరించుకోవాలన్నారు. వంతెనతోపాటు అనుబంధ రోడ్ల నిర్మాణాలను సైతం పూర్తి చేయాలని చెప్పారు. ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు మాట్లాడుతూ 2012లో ఫ్లై ఓవర్ నిర్మాణం ప్రారంభించినప్పటికీ అసంపూర్తిగా నిలిచిపోయిందన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన వెంటనే స్పందించి ప్రత్యేక నిధులు కేటాయించారని వెల్లడించారు. వంతెన పూర్తి చేస్తే గూడూరు పట్టణంలో ట్రాఫిక్ సమస్య ఉండదని స్పష్టం చేశారు. సమావేశంలో ఆర్అండ్‌బీ ఈఈ రామాంజనేయులు, గూడూరు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఎస్పీడీసీఎల్ ఈఈ ఇస్మాయిల్ పాల్గొన్నారు.

జింక అప్పగింత



గిరిజనుల సంరక్షణలో జింక

దొరవారిసత్రం : మండలంలోని కృష్ణాపురం కాలనీలోకి మంగళవారం రాత్రి ఓ జింక ప్రవేశించింది. కుక్కలు దాడి చేయబోగా స్థానిక గిరిజనులు కాపాడి అటవీశాఖ అధికారులకు అప్పగించారు. ఈ మేరకు ఫారెస్ట్ సెక్షన్ అధికారి బాలయ్య, బీట్ ఆఫీసర్ శ్రీనివాసులు వెంటనే జింకను పక్షుల కేంద్రంలోని జింకల పార్కుకు తరలించారు.